# ప్రస్థానం

శివల జగన్నాథరావు



నీలినీలి ఆకాశం కింద, పచ్చపచ్చటి చేల అందాల్ని ఆస్వాదిస్తూ, చల్లచల్లటి గాలిని అనుభవిస్తూ, నెమ్మదిగా నడుస్తోన్న నన్ను, ఎవరో పలకరించి నట్టయి, తల తిప్పి చూశాను.

ఆశ్చర్యం, ఆనందం రెండు కళ్ళయి నాయి కాస్సేపు. మనసు పుస్తకంలో రెపరెపా పేజీలు వెనక్కి వెళ్ళాయి. అక్కడోచోట నిలిచిన అమ్మాయి భారతి. పరికిణీ, వోణీ, జాకెట్టు. సన్నగా, నాజూకుగా సన్నజాజి భారతి. మళ్ళా, యిప్పుడు, యిక్కడ, బొండుమల్లె భారతి!

"నువ్వు? యిక్కడ?... " అన్నాను. ఆశ్చర్యం అంతమాటకే అనుమతి యిచ్చింది.

భారతి నవ్వి, "నే నీ వూర్లో మా అత్తయ్యతో వుంటున్నాను. ఆవిడ కిక్కడ పొలం వుంది " అంది. అని,

"మీరు ఎప్పుడు వచ్చారు, మేస్టారూ? మీ అమ్మాయిగారు ఇక్కడ వుంటున్నారు కదూ! ఓ! ఆవిడ యింటికి వచ్చా రన్నమాట? ఆరోగ్యం ఎలా వుంది మేస్టారూ," అడిగింది గబగబా.

"ఏం ఆరోగ్యంలే? కాలం చెల్లి పోతూంటే వొళ్ళు గట్టిగా ఎలా వుంటుంది చెప్పు, భారతీ? అయితే నువ్వూ, మీ అత్తయ్యా యిద్దరే వుంటున్నారా యిక్కడ? . అయితే.. "

నా సందేహాన్నీ, ఆత్రాన్నీ, మేకల మందొకటి వచ్చి ఆపేసింది. వాటి స్వేచ్ఛా, దాన్ని నిలవేస్తున్న వాటి కాపరీ, ఆ హడావుడీ ఒక సినిమాలో దృశ్యం లాగా కనిపించి, మరుగయినాయి.

భారతి నాకు నమస్కారం పెట్టి, "వస్తాను, మేస్టారూ. మళ్ళా కలుస్తాను

మిమ్మల్నిం షంటారు కదా, యింకా? ఒక నెలరోజులయినా వుండకపోతే మీ అమ్మాయిగారు వూరుకోరులెండి." అని నవ్వేసి వెళ్ళిపోయింది.

నేనూ, నా సందేహాలూ, ఆరాటమూ అలా వుండిపోయాము అక్కడ. నా పక్కన చేలు చిన్న శబ్దంతో కిసుక్కున నవ్వినట్లయింది, నన్ను చూసి చుట్ట కొంచెం దులిపి, దాన్ని గట్టిగా ఒక పీల్పు పీల్చి భారతి జ్ఞాపకాల్లోకి వెళ్ళాను. భారతికళ్ళు సంతోష సంరంభాలకి యిళ్ళలా వుండేవప్పుడు చిన్ననోరు విప్పి నవ్వితే, ఎదటిమనిషి చింతలన్నీ చిటికెలో మాయమయిపోతాయనిపించేది? యిప్పటి నవ్వులో గుంభనా, హుందాతనమూ చోటుచేసుకున్నాయి! నా సందేహం నశేషం అయిపోయిందన్న విచారంతో, తాపీగా నడుస్తున్నా వింటికి, చేతికర్ర తాటిస్తూ, చుట్టదమ్ము లాగుతూ.

అరుపదులకే పూర్తి ముసలి హంగులన్నీ వచ్చేశాయి. పాతచుట్టం కళ్ళద్దాలయితే, కొత్తచుట్టం చేతికర్ర: రిటైరయినప్పుడు, దళ్ళో మేస్టర్లు యిచ్చిన ఈ బహుమానం అక్కరకొచ్చింది! బాగా చీకటపడితే చూపానదు! తిన్నదన్నీ ఒంటికి పడవు. ఇన్ని లాంచనాలతో ఇల్లు వదల్లేకే, ఇంతదాకా నా తురి ఆహ్వానాల్ని వెనకబెట్టాను. ఆవి తప్పని సరయిందిమారు అల్లుడు మా వూర్లో ఏదో పనుండి వచ్చి, 'పనిలో పని' నన్నూ తీసుకువచ్చేడు!

వచ్చి రోజున్నరయింది. వూరు కొంచెంయిరుకున పెడుతోందనిపించింది, సుగుణ యింట్లోంచి చూస్తే, హడావుడి లేదు, రొద రొద లేదు. అంతా స్తబ్దంగా, జడంగా వుంది. ఆ మాటంటే, "అవునిది టౌను కాదు గదా? అంది సుగుణ.

ఓపిక వుంటే, ఒక్కసారలా పొలాలవేపు వెళ్ళవాన్నా."

"సరే" నని బయల్దేరాను సిద్ధంఅయి. మనుషుల హడావుడిలేంగాని, వాహనాల రొదలకేంగాని, ప్రకృతిని మాత్రం యిక్కడే చూడాలి సుమా అన్పించింది! ఎంత పైరుపచ్చదనం! ఎంత గాలి తేటదనం! అల్లుడు మోహన్రావు, ఈ వూర్లో రూరల్ డాక్టర్గా పనిచేయకపోతే, నాకు ఈ చోటకి వచ్చి, ఈ ప్రకృతి నాస్వాదనచేసే యోగం కలుగునా?

"నమస్తే, తాతయ్యగారు!"

అల్లుడి అసిస్టెంటు రాజు! అతను ఇంజెక్షన్లు చేస్తే ఇతను ఆ పరికరాలన్నీ శుభ్రంచేసి, అమర్చుతాడు. కట్లు కట్టినా, చిన్నచిన్న ఆపరేషన్లు చేసినా, మందులిచ్చినా, ప్రతి పనిలో రాజు కుడిభుజం మోహన్రావుకి.

"ఈ పూట డ్యూటీ లేదు కాబోలు మీకు?" అన్నాను.

లేదన్నాడు రాజు పొట్టిగా, మట్టసంగా వుంటాడతను. బట్టతల, మూతిమీద

ఈగ వాలినట్టున్న మీసం. లోతు కళ్ళు. వయసు నలభయి వుంటుంది. మోహ న్రావు డిస్పెన్సరీ యింటికి తగిలేవుంది, పక్కనే. అంచేత రాజప్పుడే నాకు పొత్తు కుదిరిపోయాడు. "అసల్నేను చదివింది కాంపౌండింగయితే, యిక్కడ చేసేది వర్సుపని, ఆయా పనీ, వార్డ్‌బాయ్‌పనీ అన్నీనూ... సర్లెండి! ఏదో బతకడం కావాలి. ఈ రోజుల్లో ఏ చదువుకీ, ఏ ఉద్యోగం అటాచ్ ఆయివుంది గనక? ఏమంటారు!" అన్నాడతను బలవంతంగా నవ్వి

రాజు అటు యిటు చూశాడు. ఆ తర్వాత, గొంతు తగ్గించి-

"భారతి మీకు తెల్సా తాతగారూ?" అడిగాడు!

విస్తుపోయాన్నేను.

"ఇందాక మీరు భారతితో మాట్లాడు తుంటే...."

"చూశారేవిటి?" అన్నాను.

"దూరంనించీ....వొస్తూంటే.... కని పించింది....మాట్లాడుకోవడం.. "

చుట్ట అఖరిపీల్పు పీల్చి పారేశాను. కాప్పేపు దగ్గు తప్ప చుట్టూ ఏంవీ తెల్సియ లేదు నాకు. అది తగ్గాక, కప్పించిన రాజుతో, "ఏవిటంటున్నారు?" అన్నాను.

"అదే.... భారతి గురించి.. మీకామె తెల్సోలా? అనడిగాను ..." అన్నాడు రాజు.

"బాగా తెలుసు. నేను మా వూర్లో మేష్టగిరీ వెలగబెట్టున్నప్పుడు... మా పక్కింట్లో భారతివాళ్ళు వుండేవాళ్ళు. అప్పుడు భారతి చిన్నపిల్ల. వాళ్ళ నాన్న చిన్నతనంలోనే యాక్సిడెంటయి చని పోతే, వాళ్ళమ్మగారే పెంచింది.వంటలవీ చేసి, నాలుగు డబ్బులు సంపాదించి, కూతుర్ని ఇంటరుదాకా చదివించింది. ఒక్కతే పిల్లలే. ఆ తరవాత వాళ్ళ యింటిగలవాళ్ళు వెళ్ళిపొమ్మంటే, వాళ్ళు వూర్లోనే దూరంగా, మరో యింటికెళ్ళి పోయారు. ఆ తరవాత, భారతికి పెళ్ళి అయిందని ఒక్క కబురు తప్ప, మరింకేవీ నాకు తెలీదు... ఇదిగో! ఇప్పుడే మళ్ళా చూశానాపిల్లని... "అగి,అయాసం తీర్చుకుంటుంటే-

"మీరేం అనుకోనంటే ఒక మాట" అన్నాడు రాజు. అంటే అనుకోగలిగేదే నని నాకు తెల్సు. "చెప్పండి ఫర్వాలేదు" అన్నాను.

"భారతి గురించి యిక్కడివాళ్ళకి సదభిప్రాయం లేదు... "

"అంటే?" నివ్వెరపోతూ చూశాను.

"ఆవిడ నడవడి మంచిది కాదని ఈ వూర్లో అనుకుంటారు...."

నా గుండెలో జెండాలా ఎగురుతున్న భారతి! అవనతం అయిపోతుందా!! దిగాలుగా చూసి "సరిగ్గా చెప్పండి" అన్నాను

రాజు అదోలా నవ్వాడు. "ఏముంది లెండి చెప్పడానికి? ఇలాంటి వార్తలన్నీ ఒక్క మోస్తరుగానే వుంటాయి. పెద్ద

వారు. మీకు తెలియందేముంటుంది! అయినా, నే నిలా వాగడం అప్రస్తుతం యేమో?... ఏవిటో, వాగేశాను.... వస్తాను, తాతగారూ" అంటూ వెళ్ళి పోయాడు.

అతనింకా చెబితే బావుణ్ణనిపించింది. హరికథలు వినడానికి అలవాటు పడిన జాతికి వారసుడిని!

కదలి తరంగంలా వున్న అంత రంగంతో ఇల్లు చేరాను. సుగుణ "ఇంత ఆలశ్యంచేశావేం, నాన్నా?" అంది. విషయం చెబితే విస్తుపోయింది. ముఖం ముద్ద మందారం అయింది దానికి.

"అయితే, అంత కొంచెం భోగట్టా వేనా చెప్పింది?" అంది. "ఇంకేం చెప్ప లేదూ? ఈ వూర్లో దాని విర్వాకం అదీ...."

"సుగుణా?" నా నోరు పెద్దదయింది!

"కోపం అయిపోకు, నాన్నా, భారతి చిన్నప్పటి భారతి కాదు. దాని తీరు మారి పోయింది నాన్నా. దాని మొగుణ్ణి వది లేసిందని చెబుతుందిగాని, అతగాడే దీన్ని వదిలేసివుంటాడని నాకిప్పుడు తడుతోంది. ఆ ముసలావిడ బుద్ధిలేక దీన్ని పట్టుకు వేళ్ళాడుతోందిగాని...." "మొగుణ్ణి వది లేసిందా?" ఆత్రంగా అడిగాను. నా గుండెలో భారతి కొంచెం కొంచెంగా అవనతమౌతోంది..., ఈ మార్పుకి తట్టుకోలేకపోతున్నాను. అసలే బడుగు మనిషిని...

సుగుణ వూర్కోలేదు. "అవును.... మొగుడితో కాపురం తనకి యిష్టంలేదంది. భారతి అతను చెడ్డవాడంది. అయినా మగవాడన్నాక ఏవో బలహీనత లుంటాయి. ఎవరంత మరీ వుత్తము లుంటారు? సర్దుకుపోవాలిగాని, ఆడదానికి ఆమాత్రం సహనంలేకపోతే ఎలా...."

బరువుగా వూపిరి వదిలాను.

"అలాగని మొగణ్ణి వదిలివచ్చేసింది ఎలా వుండాలి?" సుగుణ కోపంగా అంది "మగవాడి పొడే కిట్టనపుడు, మరో మగావాడికోసం పెంపర్లాట దేనికి?"

నాముందు పడుతున్నవి మాటలా? బాంబులా!

మళ్ళా, నేను షికారుకి వెళ్ళినప్పుడు భారతి కనిపించింది ఆకుపచ్చ చీరెలో. సస్యలక్ష్మిలా వుంది! ఆకాశం అరుణ రాగరంజితమైన ఆవేళ, చేలదగ్గర భారతి మనోహరంగా భాసించింది! ఇంత ముసలాడిని నన్నే సమ్మోహన పరిచే ఈ యిందువదన, వయసు కుర్ర కారుని ఆకర్షించడంలో వింతేం వుంటుంది?....

"నమస్తే మాస్టారూ!" తనే పలక రించింది.

"నీతో కొంచెం మాట్లాడాలి" అన్నాను వెంటనే.

భారతి కొంచెం ఆగింది. "అలాగే. మా ఇంటికి రండి" నడిచాను. మాకు వెనక చేతులూపుతున్నాయి, చేలు అటిటు



కదలాడుతూ. దోవలో ఎవడో మమ్మల్ని విడ్డూరంగా చూశాడు! ఇంకోడుకొంటెగా నవ్వాడేం?

చుట్ట కొతికి, ఆ పక్కన వూశాను.

పొలాల మధ్యనుంచి– పిండిమిల్లు పక్కనించి– కాకాహోటలు ఎదురు సందులోకి తిన్నగా వెళ్ళి– అక్కడ కూరలదుకాణంకి ఎడమవేపున్న మూడో యింటిముందాగింది భారతి అది చిన్న మిద్దియిల్లు. వానవించీ, ఎండనించీ చక్కటి ప్రొటెక్షను, చూడ్డానికి ఎలా వున్నా! తలుపు తోసుకొని నన్ను రమ్మంటూ లోపలికి వెళ్ళింది.

కింద గచ్చుదే నేల. గోడల సున్నం తాపడంచేసినవే. గది కొంచెం పెద్దదే. ఓ మూల నవారుమంచంమీద డెబ్బయ్యేళ్ళ స్త్రీ, గోడపక్కకి తిరిగి పడుకొని వుంది. ఆవిడ చేతులూ కాళ్ళూ ముడతలకి మళ్ళే కన్పిస్తున్నాయి. భారతి, "ఆవిడే మా అత్తయ్య.." అని చెప్పింది. ఆ తర్వాత, అక్కడవున్న ఓ పాత కొయ్యకుర్చీ జరిపి, దాని మీదున్న దుమ్ము దులిపి, కూచోమంది.

కూచున్నానే గాని, నా మనసంతా, భారతి నోటవెంట వచ్చే 'ఆ మాట' కోసమే ఎదురుచూస్తోంది. నా కళ్ళు భారతి నడివడినే పరిశీలిస్తున్నాయి. అది గేళాను ఆపుకోలేక.

"భారతీ! నేనీవూరు వచ్చిందగ్గర్నించీ, ఒకే కబురు వింటున్నాను, నీ గురించి. ఆ మాటలు వినడానికి నాకెంత కష్టంగా వుందో తెలుసా!''

అంతలో ఎవరో వాకతను చొరవగా లోపలికి వచ్చాడు. నల్లగా, పొడుగ్గా, వన్నగా వున్నాడు. ముఖంలో కళేదో ప్రస్ఫుటమౌతుంది! వయసులోవున్నాడు నన్ను కాస్సేపు చూసి, "భారతీ... మీ బంధువులా?" అనడిగాడామెని.

భారతి వెంటనే "మా వూళ్ళో మేష్టారు'' అనిచెప్పి, అతని దగ్గరగా వెళ్ళి, నెమ్మదిగా ఏదో చెప్పింది! అతను వెంటనే వెళ్ళిపోయాడు!!

నా ఆవేశం అయితేనేమి_ నా వృద్ధాప్యపు తొందరపాటు అయితేనేమి—ఆ వెంటనే— ''ఎవరతను '' అని అడిగేశాను. భారతి నవ్వి— ''మా యిద్దరికీ కావల్సినవాడు... '' అని, లోపలికి వెళ్ళింది!! అంతే!

నాకు కోపం వచ్చేస్తోంది. వెనకే వెళ్ళాను. భారతి వంటగదిలో స్టౌ వెలిగించింది గిన్నెతో నీళ్ళుపెట్టింది.

"భారతీ. ఇందాక, నా మాటలు విన్నావు కదూ?" వంటగది ద్వారం దగ్గరనించుని అన్నాను

"విన్నాను, మాస్టారు .. మీరు నా గురించి తెలుసుకుందామని వచ్చారు? అవునా? ఇక్కడ చాలా మంది నన్నెందుకు అసహ్యించుకున్నారో, కారణం ఏమిటో తెలుసుకుందామని వచ్చారు!" అంటూ భారతి నవ్వింది. ఇంకా నవ్వింది! చల్లటి, మెల్లటి పవనానికి పచ్చటి చెట్లు పలకరింతగా నవ్వినట్టు కాదు, ఈదురుగాలికి చెదిరి, కదిలి, విలువెల్లా వూగాడుతోన్నట్టు! గట్టిగా, పెద్దగా, నవ్వి, నవ్వి, ఆయాసం వచ్చిన ప్రకృతి ఆగింది. ఆగింది భారతి. ఆగి—

"అవున్లెండి, మాస్టారు! మీరు మాత్రం మనిషికారా? ఎంతమాష్టారైనా .. ఇదిగో! ముందీ కాఫీ తీసుకోండి!" అంటూ, ఒక గ్లాసు నాకిచ్చి, ఒకటి తను తీసుకొంది.

అయోమయావస్థలో పడి_ తాగేవేకగాని, దాంట్లో పంచదార కల్పిందన్న కబురు తెలిసొచ్చింది కాదు నాకు. తీపి జల్లుని తిట్టుకొని, ఖాళీగ్లా పిచ్చేశాను.

భారతి లేచి గదిలో గోడ అలమరలోవున్న, చిన్న ట్రంకుపెట్టె తాళం తీసి, లోపల వెదికి వెదికి, ఏవో వుత్తరాలు తీసుకుని వచ్చింది! అవి నాకిచ్చింది!

అంతలో, మంచమ్మీద ముసలామె కదలింది. "భారతీ " అని పిలిచింది. గొంతు వణకటం గమనించాను ఆఖరి దశలో వున్నది, ఇక ఎన్నాళ్ళో బ్రతకదనిపించింది

"ఏం, అత్తయ్యా!" అంటూ వెళ్ళింది భారతటు.

నాకు లోపల పులుకూ, పులుకూ, పొడుస్తోన్న ఒక అనుమానం— ఈవిడ భారతివి వదలకుండా, కనిపెట్టుకు వుండ డంలో అంతరార్థం ఏమిటి? కోడలంటే ఇష్టమా? లేక.... కొడుకుకి, ఈవిడకి సయోధ్య లేదా?

కొడుకుతో పడకే, భారతివి కనిపెట్టుకు వుండిపోయిందా?.. వూర్లో భారతి మీద వినవచ్చే అభియోగాలు ఈవిడ చెవులపడలేదా? లేకపోతే, ఏదీ పట్టించు కోకుండా వుంటూ ందా?

నా సందేహాలకి సమాధానం చెప్పే వాళ్ళెవరు. "భారతీ! ఎవరే అతనూ?" అవిడిటు చూసి అడిగింది!

"మా చిన్నప్పుడు మా పక్కింట్లో మాస్టారత్తయ్యా " అంటూ భారతి వివరంగా చెప్పింది.

"అలాగా?'' అవి, అవిడ నెమ్మదిగా లేచి కూచుంది. నా వేపు చూస్తూ అంది– "మీరప్పుడే వినేవుంటారు, మా భార తెంత చెడ్డదో!''

ఆశ్చర్యమే జవాబుగా నేను చూస్తూండిపోయాను.

"ఏమిటో బాబూ! లోకం తీరే అంత! కట్టుకున్నవాడికే లోకువయిన ఆడది, పరాయివాళ్ళకి లోకువదా? వాడికి బుర్ర వుంటే, వాళ్ళకి బుద్ధివుంటుంది ''

ఆ తర్వాత ఆవిడ భారతి కాఫీయిస్తే తాగి, మళ్ళీ పడుకొంది. చాలు! ఆ ముస లావిడ ఇంకేం చెప్పక్కర్లేదు నాకు! ఆవిడ పోర్షను, ఆవిడ స్వభావం, అంతా బోధపడిపోయింది!

నా చేతుల్లోని వుత్తరం ఒకటి, భారతి మాటమీద తెరిచాను. అందులో ఇలా వుంది.

"... నువ్వూ, ఆ ముసలిదీ ఏం చస్తారో చావండి! నాకు మీతో యేం సంబంధం లేదు! నాకు దాని పోలవూ అక్కర్లేదు, దానిమాటా నేను వినక్కర్లేదు! నేను చాలాదూరానికి వెళ్ళిపో తున్నాను! నా బ్రతుకు నేను బ్రతగ్గలను! ఇంటిదగ్గర కంటే ఎంతో సుఖంగా, హాయిగా బ్రతుకుతాను! యిష్టంలేని పెళ్ళి, బలవంతంగా చేసినందుకసలు దాన్ని తిట్టాలి!! నిన్ను ఎన్ని తిడితే ఏంలే? నీ మొహం చూస్తేనే నాకు విసుగు, చిరాకు, కోపం. నీ వొంటిమీద చెయ్యి తన్నడానికే వెయ్యాలనిపిస్తుంది నాకు. పోతున్నాను! మీరేడ్చినా, చచ్చినా సరే! —మురారి."

టౌన్లో అతను మెకానిక్‌గా పనిచేసే వాడని చెప్పింది భారతి.

ఒకసారి భారతివేపు చూశాను. నిర్దోషి భారతి! భర్తని త్యజించే విష యంలో, భారతి పాత్రదేం తప్పులేదు

మరొక లెటరు తెరిచాను.

" మీకు వుత్తరం రాయకూడదను కున్నాను కాని, రాయక తప్పలేదీ విషయం గురించి నేను పెళ్ళి చేసుకున్నా నిక్కడ. ఆ పిల్ల గురించి వివరాలు మీకు అనవ

సరం. వాకు మరో పెళ్ళి జరిగిపోయింది గనుక, ఇంక నామీద మీరేమీ ఆశపెట్టుకోవద్దని తెలియజేయటానికే ఈ వుత్తరం రాస్తున్నాను.....మురారి "

తిరువుగా పూసిసి విడిచాను. భారతి కళ్ళు సజలాలయి వున్నాయి. ఏడుస్తోంది. అలాంటి వాడివి భర్తగా పొందావనా? లేక....జరిగింది ఇలావుంటే, ఈ వూరివాళ్ళ అభియోగాలు మరొకలా వున్నాయనా?...

ఏం ఓదార్చుతాను? అన్ని విధాలా అశక్తుణ్ణి.

ఉత్తరాలు మడిచేసి, ఆమె కిచ్చేశాను. క్షణాలు, నిమిషాలు ఆ గదిలో మౌనంగా రోదిస్తున్నాయి. టైమెంత టైమయిందో తెలీదు. ఎక్కడో ఓ కుక్క అరుపు. దూరంగా పసిపిల్ల ఏడుపు.

భారతి చీరె చెంగుతో రెండుకళ్ళూ గట్టిగా తుడిచేసుకుని లేచి, వుత్తరాలు పెట్లో దాచేసింది అతగాడే లేనప్పుడింక, అవెందుకు?... ఆ మాటే అడిగితే.

"నాకు చెడ్డయినా, విడిచిపెట్టినా, నా మనసులోంచి అతను పోనప్పుడు, పెట్లో అతని రాతలువుంటేనేం?" అంది భారతి.

సుగుణ కబురుపెట్టింది. భారతి యింట్లో నేను వుండివుంటావని, మొత్తానికి పసిగట్టింది. నా కూతురది.

లేచి నడిచాను. ఇంటిదగ్గర తగువులాట. అల్లుడి అసిస్టెంటు రాజుకి, నేను భారతి యింట్లోవున్నప్పుడు చొరవగా వచ్చిన అతడికి. పేరు సుందరంట.

సుందరం చేతికి గాయం కనిపించింది అతను యిందాక, భారతి యింటినించి వెళ్తున్నప్పుడు, దోవలో ఎద్దు ఒకటి కుమ్మిందిట. ఎడమచేతిమీద చర్మం లేచిపోయింది. రక్తం బాగా కారుతోంది. గాయానికి కట్టుకట్టమని, మందు ఇవ్వమని అతను రాజు దగ్గరికి వచ్చాడు. రాజు అతని మాట విననట్టుండిపోయాడు ఇంకేదో పనిచేస్తూ.


సుందరానికి కోపం వచ్చి, "నా మీద మీకు కక్షవుంటే మరోసారి తీర్చుకోండి. యిప్పుడు కాదు. చెయ్యి చాలా బాధ పెడ్తోంది. వేగిరం కట్టుకట్టి, మందియ్యండి" అన్నాడు.

ఆ సమయంలో డిస్పెన్సరీలో డాక్టరు లేడు. రాజు విసురుగా, "ఇక్కడెవరూ లేరీ నర్సింగు సంగతి చూడమంటే. అంచేత, నా పనయ్యేవరకూ ఆగండి!" అన్నాడు.

"మీరట్లా వేళాకోళంగామాట్లాడవద్దు!" అన్నాడు సుందరం.

"ఏం? నే నన్నదాంట్లో తప్పేంవుంది? అదసేవలు అలవాటే గదా? నేనూ, డాక్టరుగారూ మగవాళ్ళం ..."

సుందరం బాధతో, కోపంతో దురుసుగా, "మీ అందరికీ నామీద వ్యక్తకోపం ఎందుకో నాకు తెల్సు. భారతి ఇంటికివెళ్తున్నానని, ఆవిడతో స్నేహంగా వుంటున్నానని... ఛఛ! మీరు మనుషులు కారు




రాక్షసులు!" అనేశాడు. దాంతో రాజు చెయ్యి లేచింది, సుందరం మీదికి. అంతలో మోహన్రావు వచ్చి, ఇద్దరినీ శాంతిపజేశాడు. సుందరానికి తనే చేతికి కట్టుకట్టి, ఇంజెక్షను చేశాడు.

ఇదంతా నేను ఒక ప్రేక్షకుడిగా చూస్తూండిపోయాను. ఏం సలహా యిస్తాను?

మోహన్రావు సుందరంతో, "మీరు అట్లాకోపం తెచ్చుకుంటే, మీకే నష్టం .. " అన్నాడు.

"ఏం? ఆయన అన్నమాట తప్పు కాదా?" సుందరం రాజువేపు ఆవేశంగా చూస్తూ అన్నాడు.

"వూరంతా అనుకుంటున్నదే, అతనూ అన్నాడు"

"అయితే, మీరందరికీ నేను నేరస్థుడిగా కనిపిస్తున్నానన్నమాట డాక్టర్! డాక్టరయివుండీ, మీరూ ఒక మామూలు మనిషిలా ఆలోచించడం నాకెంతో బాధగా వుంది!"

"సుందరం! ఇది పల్లెటూరు! మనం యిక్కడ మన అన్నం మనం తిని, మన బట్ట మనం కట్టుకొని వూరికి జడిసి వుండాలి! అలా వుంటేనే మన వ్యక్తిత్వం దక్కుతుంది. నీ స్వతంత్రం నీ పౌరుషానికి న్యాయం ఇవ్వదు." అంటూ సుందరం వీపుతట్టాడు డాక్టరు మోహన్రావు.

సుందరం తలవొంచుకొని గబగబా వెళ్ళిపోయాడు.

"ఇతనిక్కడ ఏం చేస్తున్నాడు" అడిగాను అల్లుడిని.

'ఇక్కడ ఏమీ చెయ్యటంలేదు, పక్క టవున్లో, హైస్కూల్లో మాస్టరుగిరీ వెలగబెడ్తున్నాడు, ప్రతీ శని ఆది

వారాలు ఇక్కడికి వస్తూంటాడు. భారతమ్మ! సాయంచేస్తుంటాడు. వాళ్ళింటికి పూరలు, వెచ్చాలవీ తేవడం, కబుర్లాడుతూండటం... ఆ యిద్దరి మంచీ సంపాదించడం అదీ పని."

అల్లుడి మాటల్లో ఏదో అసూయ దాగుడుమూతలాడ్డం గమనించాను.

"అయితే ఇంకా పెళ్ళవలేదా అతనికి?"

"లేదు. వాళ్ళ అమ్మా, నాన్నా ఎవరూలేరు, ఎవరో దూరపుచుట్టంట... బాబాయివరసట. అతని దగ్గరే పెరిగాడిక్కడ. పై చదువదీ పట్నంలో సాగింది మనిషికెంత షోకో, అంతా పౌరుషమూను."

నేనింక మాటలు పొడిగించలేదు.

ఆ మర్నాడు, మధ్యాహ్నం నిద్ర పోతూ వుండగా సుగుణ లేపి, "భారతి వాళ్ళొచ్చారు" అని మాత్రం చెప్పింది. లేచివెళ్ళాను. వీధివరండాలో, భారతి వాళ్ళ అత్తయ్య వున్నారు. కొంచెం దూరంలో ఎడ్లబండీ వుంది.

"మేం వెళ్ళిపోతున్నాం నాయనా! పట్నం వెళ్ళిపోతున్నాము. ఇక్కడ నా పొలం అదీ రైతులు చూసుకుంటారు. వాళ్ళిచ్చింది అంతే యివ్వనీయ్. మాకీ చోట జరుగుబడికంటే, తిరుగుబడి ఎక్కువయిపోయింది! ఏంచేస్తాం?..." అంది ముసలావిడ నిట్టూర్చుతూ.

నా కళ్ళు కదల్లేదు వాళ్ళమీంచి. వాళ్ళు కదల్లేదు. మాట పెగల్లేదు. భారతి చూపుల్ని నేలకి తాపడంచేసి వుండిపోయింది. మళ్ళా ముసలావిడే అంది.

"ఇది వయసులోవున్న పిల్ల. దీన్ని మొగుడు నిర్దాక్షిణ్యంగా వదిలేశాడని, నేను ఎలా వదిలివేస్తాను? అనదాన్ని! దాని అనుభవాలన్నీ తెల్సినదాన్ని! పొలం ఇక్కడుంది గదాని, ఇద్దరం ఇక్కడ పడివున్నాం. దాని వయసు దానికి శత్రువయిపోతుంటే, ఈ శత్రువులతో ఎంతకని యుద్ధం ఆడగలం? వెళతాము!! ఇదిగో! మీరొక్కళ్ళయినా, కనీసం మా బీదబ్రతుకుల్ని బోధపర్చుకుంటే, ఇద్దరం కృతజ్ఞులం!.." ఆగి-

"ఇదిగో నాయినా! మేం వెళ్తున్నచోట మహా మంచివాళ్ళుంటారని కాదు!.. ఒకవేళ, సమస్యే మళ్ళావస్తే, నేను వాళ్ళకేం చెప్పదల్చుకున్నానో తెల్సా?"

ఆవిడ ఆయాసంతో ఆగింది. సుగుణ మంచినీళ్ళు యిస్తే తాగింది.

"..మా యింటి గడపతొక్కిన సుందరం, మా భారతి భర్తని చెబుతాను!!"

సుగుణ చేతిలోంచి ఖాళీగ్లాసు వదిలిపోయింది నేలమీద. మోహనావు ఆశ్చర్యంతో చూస్తున్నాడటు. బండీవాడు పిలుస్తున్నాడు భారతీవాళ్ళని, తొందరగా రమ్మని. నేనువిగ్రహమే అయిపోయాను.

వాళ్ళు వెళ్ళి బండి ఎక్కారు. బండీ సాగిపోతోంది, గిలగల ఎద్దుమెళ్ళో మువ్వల చప్పుడుతో.